మెదక్ డీఎస్పీ రాజేశ్ బదిలీ

డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశం

మెదక్ అర్బన్, జూలై 20: మెదక్ డీఎస్పీ డా.రాజేశ్‌ను బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. గత నెలలో మెదక్‌లో జరిగిన ఘర్షణలకు పోలీసు నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు వెల్లువెత్తన నేపథ్యంలోనే బదిలీ జరిగినట్లు చర్చ జరుగుతున్నది. ఇటీవలే ఎస్పీ బాలస్వామిని ఈస్ట్‌జోన్ డీసీపీగా బదిలీ చేశారు. అంతకుముందు ఇద్దరు సీఐలను కూడా డీఐజీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

సీఎస్ఆర్ పనులు వేగవంతం చేయండి : కలెక్టర్


కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్, జూలై 20 : పరిశ్రమల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో ఆయా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఆమె సీఎస్ఆర్ నిధుల సేకరణపై అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు కేటాయించిన సీఎస్ఆర్ నిధులు జిల్లా అభివృద్ధికి వినియోగించేలా చూడాలన్నారు. ఈ నిధులను విద్య, వైద్య సదుపాయాల ఏర్పాటు కోసం ఖర్చు చేయాలన్నారు. హాస్టళ్లు, ఆసుపత్రులు, అదనపు తరగతి గదులు, విద్యా సంస్థల్లో కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన కోసం వినియోగించాలన్నారు. అనంతరం మహిళా శక్తి పథకంపై సమీక్ష నిర్వహించారు. మహిళలను కోటీశ్వరులు చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పథకం చేపట్టిందని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, శిక్షణా కలెక్టర్ మనోజ్, పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్ర, సీపీవో బాలశౌరి, డీఎఫ్‌వో శ్రీదర్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాల్లోనూ ప్రజావాణి

రేపటి నుంచి ప్రతీ సోమవారం ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించాలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. ఈమేరకు శనివారం ఆమె ప్రకటన విడుదల చేశారు. ప్రతీ సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని నిర్దీత సమయంలో పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

స్నాతకోత్సాహం

అట్టహాసంగా ఐఐటీహెచ్ స్నాతకోత్సవం

- 1,103 మంది విద్యార్థులకు పట్టాల ప్రదానం
- నలుగురికి గోల్డ్ మెడల్స్
- ఉత్సవంలో ఉట్టిపడిన స్వదేశీయత
- పోచంపల్లి చేనేత వస్త్రాలతో అలరించిన విద్యార్థులు
- ముఖ్యఅతిథిగా నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం

7 లో



వాన జోరు.. రైతు హుషారు..

సీజన్‌లో తొలిసారి పెద్ద వర్షం
జోరందుకున్న వరి నాట్లు
పత్తి పంటకు ఊరట





సంగారెడ్డి టౌన్, జూలై 20 : సంగారెడ్డి జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమై నెలన్నర గడిచినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురియక ఆందోళన చెందుతున్న రైతులకు వర్షం ఊరటనిచ్చింది. జిల్లాలోని నిజాంపేట, సిర్గాపూర్, నారాయణఖేడ్, కంగ్టి, జహీరాబాద్ మండలాల్లో అత్యధికంగా 23.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. సంగారెడ్డి, హత్నూర, పుల్కల్, చౌటకూర్, అందోల్, సదాశివపేట, కంది, కొండాపూర్, నాగల్‌గిద్ద, మొగుడంపల్లి, ఝరాసంగం, న్యాల్‌కల్, రామచంద్రాపురం, మునిపల్లి తదితర మండలాల్లో 23.2 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.

పంట	సాగు అంచనా (ఎకరాల్లో)	ఇప్పటి వరకు సాగు విస్తీర్ణం
వరి	1.50 లక్షలు	8,881
పత్తి	3.60 లక్షలు	3,28,809
కంది	79,500	65,956
సోయాబీన్	77,600	64,827
జొన్న	14,200	8,827
మినుములు	7,222	6,300
పెసర	9,800	10,270
చెరుకు	25,000	12,572

పది శాతం నాట్లు కూడా పడలేదు..

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 7,22,400 ఎకరాల్లో వివిధ పంటలు వేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. కానీ వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటివరకు 5,06,832 ఎకరాల్లోనే పంటలు సాగు చేశారు. వరి నాట్లు పది శాతం కూడా వేయలేదు. జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని అంచనా వేయగా.. ఇప్పటి వరకు 8,881 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. జలవనరుల్లో నీరు లేకపోవడంతో బోర్లపై ఆధారపడిన రైతులు మాత్రమే నాట్లు వేశారు. నిన్న కురిసిన వర్షాలకు జిల్లావ్యాప్తంగా వరి నాట్లు ఊపందుకున్నాయి. సింగూరు, నల్లవాగు, నారింజ రిజర్వేయర్ల కింద రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా మారారు. అలాగే, పత్తి, కంది, సొయాబీన్, జొన్న, మినుములు, పెసర, చెరకు తదితర పంటలకు ఎరువులు వేసుకుంటున్నారు.

విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండండి : ఎస్ఈ

వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని ట్రాన్స్‌కో ఎస్ఈ మాధవరెడ్డి ఓ ప్రకటనలో కోరారు. వర్షాల కారణంగా స్తంభాలు, స్టార్టర్ డబ్బాలు, గోడలు, మోటార్లు, తెగిపడిన విద్యుత్ తీగలు, సర్వీస్ వైర్లు, సపోర్టు తీగలను తాకవద్దని విజ్ఞప్తి చేశారు. ఏ అవసరం ఉన్నా విద్యుత్ సిబ్బంది, లేదా విద్యుత్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.


రామాయంపేట పాత హైవేపై వర్షానికి నేలకూలిన భారీ వృక్షం

ముసురు..

మెదక్ జిల్లాలో చిరుజల్లులు

మెదక్/మెదక్ కల్చరల్, జూలై 20. అల్పపీడన ద్రోణి ప్రభావంతో రెండు రోజులుగా మెదక్ జిల్లాలో ముసురు పట్టింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా చినుకులు పడుతూనే ఉండడంతో జనజీవనం స్తంభించింది. చిరువ్యాపారులు, కూలీలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఊరట కలిగింది. వరినాట్లు వేగవంతమవుతాయని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. జిల్లాలోనే అత్యధికంగా మాసాయిపేట మండలంలో గడిచిన 24 గంటల్లో 30.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చిన్నశంకరంపేటలో 20.3 మి.మీ.లు చేగుంటలో 18 మి.మీ.లు, నర్సాపూర్‌లో 15 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 10 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.


వెల్దుర్తిలో నాటేస్తున్న మహిళలు

సంగారెడ్డిలో కంట్రోల్‌రూం

నంబరు 8712656739


సంగారెడ్డి ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, జూలై 20: అల్పపీడనం కారణంగా జిల్లాలో రెండు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100 లేదా, పోలీస్ కంట్రోల్‌రూం నంబరు 8712656739ను సంప్రదించాలని కోరారు. సంగారెడ్డి జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేసినందున జిల్లా పోలీసులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు ఎవ్వరు కూడా అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకూడదని పేర్కొన్నారు. జలాశయాలు నిండే అవకాశం ఉన్నందున చూడటానికి వెళ్లకూడదని సూచించారు. పోలీసులు ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్‌హెచ్‌ఓలు ప్రత్యేకంగా తమ తమ ఏరియాలో ఉన్న చెరువులు కుంటలు, ఆనకట్టలు ప్రమాదం అంచున ఉన్నట్లయితే సమాచారం ఇవ్వాలని పోలీసులకు సూచించారు.

జాగ్రత్తగా ఉండండి..

ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకూడదని జిల్లా ఎస్పీ రూపేష్ ప్రజలకు సూచించారు. ప్రమాద కారణాల కారణంగా చెరువులు, కుంటలను చూడటానికి వెళ్లకూడదన్నారు. రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. విద్యుత్ స్తంభాలనుగానీ, వైర్లనుగానీ చేతులతో తాకరాదన్నారు. నీరు నిల్వ ఉన్న విద్యుత్ స్తంభాల దగ్గర నుంచి వెళ్లకూడదని చెప్పారు. వాగులు,వంకలు, బ్రిడ్జిలపై నుంచి పొంగి, ప్రవహించే సమయంలో దాటానికి ప్రయత్నించకూడదన్నారు. పాడైన పాత భవనాల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల పక్కన నివాసం ఉండరాదన్నారు.

వానాకాలం చదువు..!



రామాయంపేట పట్టణం బీసీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం వర్షానికి ఉరుస్తున్నది. శనివారం ఉదయం నుంచి వాన కురుస్తుండడంతో విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. స్లాబ్ నుంచి నీరు లీకై వరండాపై పడుతుండడంతో క్లాసంతా తడిసిపోతున్నది. దీంతో శనివారం ఇలా వాన నీటికి బకెట్లను పెట్టి తరగతులు కొనసాగించారు. చలికి, వానకు పిల్లలు ఇబ్బందిపడ్డారు.

-రామాయంపేట

రోడ్ టెర్రర్

వేర్వేరు చోట్ల ప్రమాదాలు

నలుగురి దుర్మరణం

- ఆత్మకూర్ వద్ద కారు పల్టీలు కొట్టి బోల్తా
- విహారయాత్రకు వచ్చిన ఇద్దరు విద్యార్థుల దుర్మరణం
- కాళ్లకల్ జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొన్న కారు
- ఓ మహిళతో పాటు మరొకరు మృతి

సదాశివపేట/మనోహరాబాద్, జూలై 20 : అతివేగం, రోడ్లు సరిగ్గా లేకపోవడం, చినుకులతో గుంతల్లో నీళ్లు నిలిచి ఉండటం వెరసి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో మొత్తం నలుగురు చనిపోయారు. ఇందులో ఇద్దరు బీటెక్ విద్యార్థులు ఉన్నారు. ఆరుగురు స్నేహితులు సింగూరు ప్రాజెక్టు సందర్శన కోసం వస్తుండగా, సదాశివపేట మండలం ఆత్మకూర్ వద్ద వీరి కారు గోతుల్లో పడి పల్టీలు కొట్టుకుంటూ ఓ విద్యుత్ స్థంబాన్ని ఢీ కొట్టి బోల్తా పడింది. మరో ప్రమాదంలో ఓ మహిళ, ఇంకో వ్యక్తి చనిపోయారు. మూడు కుటుంబాలు కలిసి బాసరలో తమ బంధువుల చిన్నారికి అక్షరాభ్యాసం చేయించేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

విషాదం మిగిల్చిన విహారం

విహార యాత్ర... కాస్తా విషాద యాత్రగా మారింది. హైదరాబాద్ టోలిచౌక్ ప్రాంతానికి చెందిన బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆరుగురు స్నేహితులు సింగూర్ ప్రాజెక్టును చూసేందుకు కారులో ఇంటి నుంచి బయలుదేరారు. వారి కారు సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆత్మాకూర్ గ్రామ శివారులోకి రాగానే రోడ్డు బాగోలేక కారు అదుపుతప్పి పల్టీలు కొడుతూ రోడ్డు పక్కనే ఓ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఓ యువకుడు ఘటనా స్థలంలోనే మృతి చెందగా మరో యువకుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం...హైదరాబాద్ నగరంలోని టోలిచౌక్ ప్రాంతానికి చెందిన జోహేద్(19), ఫైజాన్ (19), ఖసీం(19), జకీయోద్దిన్(19), సిద్ధిఖ్‌ఖాన్(19), షహజాన్(19)లు నగరంలోని మొహినాబాద్ లాడ్స్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఒకే కాలేజిలో చదివే ఆరుగురు స్నేహితులు కలిసి విహారయాత్రం కోసం సంగారెడ్డి జిల్లా అందోల్-సంగారెడ్డి నియోజకవర్గాల పరిధిలోని మంజీరా నది (సింగూర్-ప్రాజెక్టు)ను సందర్శించేందుకు శనివారం మధ్యాహ్నం మహీంద్రా ఎక్స్‌యూవీ-500 కారులో బయలుదేరారు. ఆత్మాకూర్ గ్రామ శివారులో లక్ష్మీకాంత కాటన్ పరిశ్రమ వద్దకు రాగానే కారు అదుపుతప్పి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న సిద్ధిఖ్‌ఖాన్(19)అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన జకియోద్దిన్(19) చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృత్యువాత పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన మరో నలుగురిని స్థానికులు, పోలీసులు సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు సిద్ధిఖ్‌ఖాన్ తండ్రి మొహమ్మద్ యాసీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ మహేష్‌గౌడ్ పేర్కొన్నారు.

అక్షరాభ్యాసానికి వెళ్తూ.. అనంతలోకాలకు..

కుటుంబ సభ్యులతో కలిసి చిన్నారి అక్షరభ్యాసం కోసం బాసర వెళ్తున్న ఆ కుటుంబంలోని ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన ఈ ఘటన వివరాలు ఎస్ఐ సుభాష్ గౌడ్ కథనం ప్రకారం.. హైదరాబాద్ మూసాపేటకు చెందిన ఓ కుటుంబం చిన్నారి అక్షరాభ్యాసం కోసం శనివారం బాసరకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు బంగారమ్మ ఆలయం వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి, రోడ్డు పక్కన గుంతలో బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న మంగవెల్లి ఆజారావు(55) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాలతో సనత్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భాస్కర్‌రావు(57) చనిపోయారు. మరో చిన్నారి పరిస్థితి విషమంగా ఉందని. విషయం తెలిసి పోలీసులు గాయపడిన వారిని తుప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారులో ఏడుగురు పెద్దలు, నలుగురు పిల్లలు మొత్తం 11 మంది ఉండగా, పలువురుకి గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కాళ్లకల్ వద్ద ప్రమాద దృశ్యం


సదాశివపేట వద్ద బోల్తాపడిన కారు

ఈనెల 26న బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
అర్జున్ 70ఎంఎం - కూకట్‌పల్లి | మేఘ 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్ | వైజయంతి 70 - నాచారం
తారకరామ 70 - కాచిగూడ | రాజ్యలక్ష్మి 70ఎంఎం - ఉప్పల్ | ముకుంద్ 70 - మేడ్చల్
GLOBAL CINEMAS RELEASE

జీతాలు చెల్లించాలని ఉపాధ్యాయుల నిరసన

బెజ్జంకి, జూలై 20: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు సరైన సమయంలో జీతాలు అందడం లేదని బెజ్జంకి అనుబంధ గ్రామమైన ఎల్లంపల్లి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ప్లకార్డులతో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీన వచ్చే వేతనాలు 20వ తేదీ దాటినా రావడం లేదన్నారు. ప్రతినెలా ఇదేవిధంగా జరుగుతుండటంతో బ్యాంకు ఈఎంఐలు, కుటుంబ ఆర్థిక అవసరాలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే 010 ట్రెజరీ ద్వారా ప్రతీనెల 1న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే బదిలీలు, ప్రమోషన్స్, హెల్త్ కార్డ్స్, కారుణ్య నియామకాలు చేపట్టాలని వారు కోరారు. ఈ నిరసనలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఫలారం బండి ఊరేగింపు


దుర్గమ్మతల్లికి ఫలారం బండిని ఉరేగిస్తున్న ఆటిపాముల కుటుంబసభ్యులు

సదాశివపేట, జూలై 20: పట్టణంలో దుర్గమ్మ జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. పదిరోజుల పాటు సాగే జాతరలో భాగంగా అనవాయితీగా శుక్రవారం రాత్రి పట్టణానికి చెందిన ఆటిపాముల శ్రీకాంత్ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో దుర్గభవాని ఫలారం బండి (పట్టు వస్త్రాల-నైవేద్యం) ఊరేగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో గొర్రెపొట్టేళ్లతో అలంకరించిన అమ్మవారి ఫలారం బండిని, పోతరాజుల విన్యాసాలు, కళాకారుల నృత్యాలను, మహిళల బోనాలను తిలకించారు. భక్తులకు తీర్థ అన్న, ప్రసాదలు, పానీయాలు అందించారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కాటేజీలు, కొత్తగా నిర్మిస్తున్న కాటేజీలు

అర్బన్‌పార్కు.. మరింత ఆకట్టుకునేలా..

- ప్రారంభానికి సిద్ధంగా కాటేజీలు
- కొత్తగా స్విమ్మింగ్‌పూల్, బంకెట్‌హాల్

నర్సాపూర్, జూలై 20: నర్సాపూర్ ప్రాంతం పచ్చని చెట్లతో అడవులకు ప్రత్యేకం. ముఖ్యంగా హైదరాబాద్-మెదక్ జాతీయ రహదారిపై ప్రయాణించే వారు పచ్చని చెట్ల మధ్య నుంచి వెళ్తూ అనుభూతిని ఆస్వాదిస్తుంటారు. అటువంటి అటవీ ప్రాంతంలో పర్యాటకులను ఆకర్షించడంతో పాటు అటవీ సంపద విశిష్టత తెలియజేయడానికి అర్బన్ పార్కును ఏర్పాటు చేశారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో అర్బన్‌పార్కును చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తున్నారు. ఈ క్రమంలో పర్యాటకులను మరింత ఆకట్టుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లపై అటవీశాఖ దృష్టి సారించింది. పైగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు అతి సమీపంలో నర్సాపూర్ అడవులు ఉన్నందున పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చేస్తే మంచి పేరు వస్తుందన్న ఉద్దేశంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అర్బన్‌పార్కుకు వచ్చినవారు పార్కు అంతా కలియతిరిగి సేద తీరేందుకు ఇప్పటికే రూ.3 కోట్లతో ఐదు కాటేజీలు, రెండు అతిథిగృహాలు, వంటగది, డైనింగ్‌హాల్, రిసెప్షన్ సెంటర్, వాటర్ ట్యాంకు నిర్మించి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఇవి ప్రైవేట్ వారికి నిర్వహణకు అప్పగించాలనే ఆలోచనలో ఉన్నారు. ఇవి ప్రారంభమైతే రాత్రిపూట కూడా ఓ వైపు పచ్చని అడవి, మరోవైపు నర్సాపూర్ చెరువు అందాల మధ్య సేద తీరి అక్కడే రుచికరమైన భోజనాలు చేసి వెళ్లే అవకాశం రానున్నది.

15 కాటేజీలు, బంకెట్ హాల్, స్విమ్మింగ్‌పూల్

అర్బన్‌పార్కుకు పర్యాటకుల తాకిడి పెరుగుతుండడంతో వారికి మరిన్ని సదుపాయాలు ఏర్పాటు చేయడమే కాకుండా.. పూర్తిస్థాయి టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దేందుకు అటవీశాఖ చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా ఇప్పటికే నిర్మాణం పూర్తయిన కాటేజీలే కాకుండా అదనంగా మరో 15 కాటేజీలు నిర్మాణాలు చేపట్టారు. వీటితో పాటు ఒక బంకెట్‌హాల్, స్విమ్మింగ్‌పూల్ నిర్మాణం పనులు చకచకా సాగుతున్నాయి. పర్యావరణానికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా పర్యాటకశాఖ నిబంధనల ప్రకారం అన్ని ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇవన్నీ పూర్తయి అందుబాటులోకి వస్తే పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా మారనున్నది.


అర్బన్‌పార్కులో ప్రత్యేకతను చాటుకుంటున్న వాచ్‌టవర్

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

పటాన్‌చెరు, జూలై 20: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం చోటు చేసుకున్నది. సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై పాత టోల్‌గేట్ వద్ద ఉదయం గుర్తుతెలియని (60) ఏళ్ల వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. మృతదేహాన్ని సంగారెడ్డి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నేరస్థులు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి: డీఎస్పీ

జహీరాబాద్, జూలై 20: సమాజంలో ప్రతీ వ్యక్తి క్షణికావేశంలో చేసే తప్పిదాలతో కేసుల్లో కూరుకుపోయి భవిష్యత్‌లో ఇబ్బందులు పడుతామనే విషయాన్ని అందరూ గ్రహించాలని జహీబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని పస్తాపూర్‌లో గల ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గంలోని కోహీర్, ఝరాసంగం, జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్ మండలాలకు చెందిన వివిధ నేరాల్లో ఉన్న పలువురితో సమావేశం నిర్వహించారు. రౌడీషీటర్లు, గంజాయి కేసుల్లో, దొంగతనాల కేసుల్లో ఉన్నవారందరినీ పిలిపించి సంతకాలు, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేరస్థులందరూ సత్ప్రవర్తనతో నడుచుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో అనుకోకుండా ఎలాంటి ఘటనలు చోటు చేసుకున్నా ముందస్తుగా వీరందరినీ అదుపులోకి తీసుకుంటామన్నారు. వివిధ నేరాల్లో ఉన్నవారందరూ పోలీసులకు సహకరించాలని తెలిపారు. నేరస్థులు ప్రజలను, అధికారులను ఇబ్బందులు పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు రాజబోయిన రవి, నయిమోద్దీన్, ఎస్ఐలు కాశీనాథ్, ప్రసాదరావు, అరుణ్‌కుమార్, రాజిరెడ్డి, నరేష్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



నేరస్థుల వేలిముద్రలను సేకరిస్తున్న పోలీసులు

SUPER HIT నేడే చూడండి



NTR CINEMAS 9030161717

IT'S A MESSAGE ORIENTED MOVIE నేడే చూడండి



శాంతి 70ఎంఎం - నారాయణగూడ 11.00,2.00,6.00,9.00
మెగా 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
వెంకటసాయి 70 - కీసర 11.00,2.00,6.00,9.00
వెంకటేశ్వర 70 - గుమ్మడిదల 11.00,2.00,6.00,9.00
SAI VUSUVAL HOUSE 9849153511/7013388396

YOUTHFUL SUSPENSE THRILLER నేడే చూడండి



సప్తగిరి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
SRI VIJAYA FILMS

UNANIMOUS EPIC BLOCKBUSTER
విజయవంతమైన 4వ వారం
తగ్గించబడిన టికెట్ రేట్స్
మల్టీప్లెక్స్: 295/-, 350/-, సింగిల్ స్క్రీన్: 175/-,110/-, 50/-



సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
తెలుగు 2D
GLOBAL CINEMAS RELEASE

FAMILY ENTERTAINMENT విజయవంతమైన 5వ వారం



శ్రీకృష్ణ 70ఎంఎం - అలియాబాద్ 11.00,2.00,6.00,9.00
PARAM JYOTHI FILMS 9848028739

విజయవంతమైన 2వ వారం



సుదర్శన్ 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.00,9.45
టికెట్ ధర: 175/-, 110/-, 55/-
అర్జున్ 70ఎంఎం - కూకట్‌పల్లి 11.00,2.30,6.00,9.30 | రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.30,6.00,9.30
GLOBAL CINEMAS RELEASE

నవోదయలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

వర్గల్, జూలై 20: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న జవహర్ నవోదయ విద్యాలయం వర్గల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతి ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ రాజేందర్ శనివారం తెలిపారు. ఉమ్మడి మెదక్ (మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి) జిల్లాలలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఇంటర్నెట్ సెంటర్, మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అందుకుగాను విద్యార్థి చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతకంతో కూడిన ధ్రువపత్రాం, ఫొటోలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చివరి 16-09-2024 అని, 18-01-2025 రోజున ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాల కోసం నవోదయ వెబ్‌సెట్‌లో చూడాలన్నారు.

మెరిట్‌కే ప్రాధాన్యత

నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించే పరీక్షలో ప్రతిభ ఉన్న విద్యార్థుల మెరిట్ తుది ప్రామాణికమని ప్రిన్సిపాల్ రాజేందర్ చెప్పారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సీటు ఇప్పిస్తామని కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు తీసుకుంటున్నారని సమాచారం తెలిసిందని, అలాంటివి నమ్మొద్దని తెలిపారు.

'పత్తి చేలల్లో నీరు నిలువకుండా చూడండి'

పుల్‌కల్, జూలై 20: పత్తి చేలల్లో వర్షపు నీరు నిలువకుండా చూడాలని, అధిక వర్షపాతంతో విత్తనాలు కుళ్లిపోయే ప్రమాదముందని సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాహుల్‌విశ్వకర్మ రైతులకు సూచించారు. చౌటకూర్ మండలం వెంకటకిష్టాపూర్ గ్రామ శివారులో రైతులు సాగుచేస్తున్న పత్తి పంటను శనివారం పరిశీలించారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి పంట సాగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు చేశారు. కొన్నిరోజుల వరకు వర్షాలు లేక ఇబ్బందులు పడిన రైతులకు ప్రస్తుతం కురుస్తున్న ముసురు వాన ఒక రకంగా ఉపయోగకరమేనన్నారు.

కూబాతండాలో తెరుచుకోని పాఠశాల


ఉపాధ్యాయులు గైర్హాజరు కావడంతో తెరుచుకోని పాఠశాల

నాగల్‌గిద్ద, జూలై 20: మండల పరిధిలోని కూబాతండాలో ఉన్న స్థానిక ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులిద్దరూ రాకపోవడంతో పాఠశాల తెరుచుకోలేదు. ఈ విషయమై తండావాసులు మాట్లాడుతూ తమ తండాకు వచ్చే ఉపాధ్యాయులు సరిగ్గా సమయం పాటించకపోవడంతో పాటు, తరచూ విధులకు గైర్హాజరవుతున్నారని తెలిపారు. దీనిమూలంగా తమ పిల్లల భవిష్యత్ ఎలా అని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధ్యాయులు సరిగ్గా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

యువకుడి ఆత్మహత్య


ఆంజనేయులు (ఫైల్)

తూప్రాన్, జూలై 20: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లిలో శనివారం సాయంత్రం చోటు చేసుకున్నది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్రెడ్డిపల్లికి చెందిన గార్ల ఆంజనేయులు(40) వ్యవసాయం, పౌల్ట్రీ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడికి భార్య మౌనిక, ముగ్గురు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



ఐఐటీహెచ్ 13వ స్నాతకోత్సవంలో విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న డైరెక్టర్ బీఎస్ మూర్తి


పట్టాలు పొందిన విద్యార్థులు


స్నాతకోత్సవానికి చేనేత వస్త్రాలతో హాజరైన విద్యార్థులు

అట్టహాసంగా ఐఐటీహెచ్ స్నాతకోత్సవం

- 1,103 మంది విద్యార్థులకు పట్టాల ప్రదానం
- నలుగురికి గోల్డ్ మెడల్స్
- ఉత్సవంలో ఉట్టిపడిన స్వదేశీయత
- పోచంపల్లి చేనేత వస్త్రాలతో అలరించిన విద్యార్థులు
- ముఖ్యఅతిథిగా నీతి అయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం


నీతి అయోగ్ సీఈవోకు జ్ఞాపికను అందజేస్తున్న బీవీఆర్ మోహన్‌రెడ్డి

కంది, జూలై 20: సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో 13వ స్నాతకోత్సవం శనివారం అట్టహసంగా జరిగింది. ఐఐటీహెచ్ క్యాంపస్‌లోని గ్రౌండ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఆడిటోరియంలో వైభవంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నీతి అయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీవీ.ఆర్.సుబ్రహ్మణ్యం ఐఐటీహెచ్‌లో చదివిన బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, పీహెచ్‌డీల్లోని వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 1,103 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. పట్టాలు పొందిన విద్యార్థుల్లో నలుగురు గోల్డ్‌మెడల్స్ సాధించారు. స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. తమ పిల్లలు ఐఐటీ డిగ్రీలు తీసుకున్న సందర్భంగా ప్రత్యక్షంగా తిలకించారు. నీతి అయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీవీ.ఆర్.సుబ్రహ్మణ్యం విద్యార్థులకు సందేశాన్నిచ్చారు. ఐఐటీహెచ్ జపాన్ సహకారంతో ఎన్నో అద్భుతమైన ప్రాజెక్టును చేపట్టిందని ఆయన తెలిపారు. 5జీ, 6జీ టెక్నాలజీతో పాటు పలు రంగాల పరిశోధనల్లో ఐఐటీ-హెచ్ కీలక పాత్ర పోషిస్తున్నదన్నారు. కొత్త ఆలోచనను, వినూత్న పరిశోధనలను ప్రోత్సహించడంతో పాటు పలు వైవిధ్యమైన అంకుర సంస్థలను ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. ప్రపంచంలో భారతదేశం అద్భుత పురోగతి సాధిస్తున్నదని పేర్కొన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా రూపొందడంలో యువశాస్త్రవేత్తలు కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. స్నాతకోత్సవం సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి సందేశాన్ని, సంస్థ సాధించిన ప్రగతిని, పరిశోధనల గురించి వివరించారు. అనంతరం ఐఐటీహెచ్ బీవీఆర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఐఐటీహెచ్ ప్రారంభించి దశాబ్దకాలంగా ఆకాశమే హద్దుగా ఎదిగిన తీరును వివరించారు. ఇంటర్ డిసిప్లీనరీలో ఇండస్ట్రీ ఓరియంటెడ్ ప్రోగ్రామ్‌ల ద్వారా తొలిసారిగా గ్రాడ్యుయేట్ బ్యాచ్ పట్టాలు పొందడం హర్షణీయమన్నారు. దేశం గర్వించేలా ఐఐటీహెచ్ శాస్త్రవేత్తల పరిశోధనలుఉన్నాయని ఆయన కొనియాడారు. ఐఐటీహెచ్‌లో చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో శాస్త్రవేత్తలుగా పేరే ప్రఖ్యాతలు గడిస్తున్నారని వెల్లడించారు. ఐఐటీహెచ్ విద్యార్థులు రేపటి తరానికి మార్గదర్శకులుగా ఉండాలని ఆశిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఐఐటీహెచ్ నెంబర్‌వన్ స్థానంలో నిలవడం ఖాయమన్నారు. గతేడాది నుంచి ఐఐటీహెచ్‌లో ప్రవేశపెట్టిన మూడు కొత్త కోర్సులకు పట్టాలు ప్రదానం చేశారు. అందులో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, ఆన్‌లైన్ ఎంటెక్ ప్రోగామ్‌లకు తొలిసారిగా గ్రాడ్యుయేట్ బ్యాచ్ పట్టాలు పొందడం హర్షణీయమన్నారు. ఐఐటీహెచ్ స్థాపించిన 16 ఏళ్ల నుంచి ఇన్వెంటింగ్, ఇన్నోవేటింగ్ టెక్నాలజీ ఫర్ హ్యూమానిటీతో దూసుకుపోదందని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి అన్నారు.

సంప్రదాయ దుస్తుల్లో..

స్నాతకోత్సవానికి విద్యార్థులు, ప్రొఫెసర్ల బృందం పోచంపల్లి చేనేత వస్త్రాలతో హాజరవ్వడంతో స్వదేశీయత ఉట్టిపడింది. ఇప్పటివరకు ఐఐటీహెచ్‌లో నిర్వహించిన ప్రతీ స్నాతకోత్సవానికి పోచంపల్లి చేనేత వస్త్రాలు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఐఐటీహెచ్ లోగో ముద్రించిన ఎరుపు, నారింజ, ఊదా, ఆకుపచ్చ, నీలం రంగు స్కార్ఫ్‌లతో విద్యార్థులు ఖద్దరు లాల్చీ, పైజామాలు ధరించగా, విద్యార్థినులు సంప్రదాయకంగా చేనేత చీరకట్టుతో చూపరులను ఆకట్టుకున్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

ప్రతిష్ఠాత్మకంగా ఐఐటీహెచ్ నుంచి ఇంజనీరింగ్ పట్టాలు పొందిన విద్యార్థులు అంబరాన్నంటేలా సంబరాలు చేసుకున్నారు. పట్టాలు స్వీరించిన అనంతరం ముఖ్యఅతిథి, ప్రొఫెసర్లతో గ్రూపు ఫొటోలు తీసుకున్నారు. తాము అందుకున్న పట్టాలు చూపుతూ, స్కార్ఫ్‌లను గాల్లో ఎగురవేస్తూ కేరింతలు కొట్టారు. పట్టాలు పొందిన ఆనంద క్షణాలను తమ తల్లిదండ్రులతో కలిసి సెల్‌ఫోన్లలో సెల్ఫీలు దిగుతూ సంబరపడ్డారు. దీంతో ఐఐటీహెచ్ ప్రాంగణమంతా విద్యార్థుల కేరింతలతో మార్మోగింది.

వైభవంగా గీతం స్నాతకోత్సవం

- హాజరైన బార్క్లేస్ బ్యాంక్ పూర్వ సీఈవో రామ్ గోపాల్

పటాన్‌చెరు రూరల్, జూలై 20: రుద్రారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శనివారం 15వ పట్టభద్రుల దినోత్సవం (స్నాతకోత్సవం) శనివారం వైభవంగా నిర్వహించారు. గీతం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గౌతమరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బార్క్లేస్ బ్యాంక్ ఇండియా పూర్వ సీఈవో రామ్ గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నుంచి 2023-24 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్, ఫార్మసీ, హ్యూమానిటీస్, ఆర్కిటెక్చర్ కోర్సులు పూర్తిచేసిన 1,490 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ప్రత్యక్షంగా 1,325 మంది, పరోక్షంగా (ఇన్ ఆబ్‌సెన్సియా) 69 మంది పట్టభద్రులకు డిగ్రీలను, 23 మంది ప్రతిభావంతులకు బంగారు పతకాలను అందజేశారు. ఈసీఈ విభాగంతో పాటు బీటెక్ టాపర్‌గా నిలిచిన కె.కీర్తి గీతం అధ్యక్షుడి పేరిట నెలకొల్పిన రెండు బంగారు పతకాలను అందుకోగా, పీజీ బెస్ట్ ఆల్ రౌండర్‌గా ఎంబీఏ విద్యార్థి శివకుమార్ శివాంజలి, యూజీ బెస్ట్ ఆల్ రౌండర్‌గా బీఎస్సీ విద్యార్థిని వర్ష మెథైలి నిమ్మకాయల బంగారు పతకాలను అందుకున్నారు. పట్టభద్రులంతా తెల్లని దుస్తులు, ఎర్రని కండువాలతో వచ్చి భారతీయతను చాటారు. బంగారు పతక విజేతలు, పట్టభద్రులు పలువురు గీతమ్‌తో తమకున్న అనుబంధం, అక్కడ ఎదిగిన తీరు, విద్యనభ్యసించేటప్పటి పలు మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. పండుగ వాతావరణంలో గీతం 15వ పట్టభద్రుల దినోత్సవం ముగిసింది.


పట్టా అందుకుంటున్న విద్యార్థిని

మహా సముద్ర ప్రాంతాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

హుస్నాబాద్‌రూరల్, జూలై 20: ఈనెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'మహాసముద్రంకు మహర్దశ వచ్చేనా' అన్న కథనంపై మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా అధికారులు స్పందించారు. మంత్రి ఆదేశాల మేరకు శనివారం సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఇరిగేషన్, టూరిజం శాఖల అధికారులతో మహాసముద్రం ప్రాంతాన్ని పరిశీలించారు. మహాసముద్రంలోకి నీరు ఎక్కడి నుంచి వస్తుంది. దీని కెపాసిటీ ఎంత..? గుట్టల పైభాగాన కోట కిలలు, సర్వాయిపాపన్న నిర్మించిన కోట గోడ, పైన ఉన్న దేవతల విగ్రహాలు, నీటి కొలనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా చేస్తే గుట్టల పైభాగానికి వెళ్లేందుకు కావాల్సిన రహదారి, మహాసముద్రంలో బోటింగ్ ఏర్పాటు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మహాసముద్రానికి వెళ్లే దారి గండి పడడంతో పర్యాటకులకు ఇబ్బందులు లేకుండా అవుట్ ఫ్లో కెనాల్‌పై కల్వర్టు నిర్మాణం చేపట్టేందుకు రూ.18 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసి నిధుల మంజూరు కోసం పంపామని ఇరిగేషన్ అధికారులు అదనపు కలెక్టర్‌కు వివరించారు. ఎట్టకేలకు మహాసముద్రానికి మహర్దశ లభించనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం రాములపల్లి గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా సాగుచేసిన మామిడితోటను పరిశీలించారు. పోతారం(ఎస్)లో స్త్రీశక్తి మహిళల కుట్టు శిక్షణా కేంద్రాన్ని, నానో ఓవెన్ బ్యాగ్స్, పేపర్‌ప్లేట్స్, గార్మెంట్స్ యూనిట్లను సందర్శించి మహిళల స్వయం ఉపాధిపై ఆరాతీశారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఈ ప్రాంతంలో పెద్ద మొత్తంలో ఏర్పాటు చేయాలని సూచించారు. ఆమె వెంట డీఆర్డీవో జయదేవ్ ఆర్య, అదనపు డీఆర్డీవో మధుసూదన్, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, పీసీసీ సభ్యులు కేడం లింగమూర్తి, బంక చందు, చిత్తారి పద్మ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కర్ణాకర్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఏపీఎం జి.శ్రీనివాస్, సీసీలు రవీందర్, అశోక్, వీవోఏ కనకతార, యమునా తదితరులు ఉన్నారు.


మహాసముద్రం గుట్టల ప్రాంతం నుంచి కాలినడకన అధికారులతో వస్తున్న అగ్రవాల్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నర్సరీని సందర్శించిన అదనపు కలెక్టర్

హుస్నాబాద్, జూలై 20: హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్ నర్సరీని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ శనివారం సందర్శించారు. నర్సరీలో మొక్కల పెంపకంపై సలహాలు, సూచనలు చేశారు. పట్టణంలో మొక్కలు విరివిగా నాటాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రం

- ప్రారంభించిన కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూలై 20: ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని శనివారం కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రారంభించి మాట్లాడారు. వివిధ పనుల నిమిత్తం, సమస్యలు విన్నవిస్తూ.. అర్జీలు సమర్పించేందుకు అనునిత్యం కలెక్టరేట్‌కు వచ్చేవారికి సైతం ప్రజాపాలన సేవా కేంద్రం అందుబాటులో ఉండాలని భావించి ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్ పట్టణాలతో పాటు అన్ని మండల కేంద్రాల్లో సేవా కేంద్రాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారంటీల్లోని వంట గ్యాస్ సిలిండర్ రాయితీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఈడీఎం మేనేజర్ సందీప్, డీపీవో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలతో ఆర్థిక భరోసా

యువతీ, యువకులు వృత్తి నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుంటూ వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా చేకూరుతుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలోని వివిధ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకొని ఉత్తీర్ణులైన వారికి కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో నాగరాజు, సెంటర్ ఇన్‌చార్జి మనిషా, సిబ్బంది పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

స్థల పరిశీలన

రామాయంపేట, జూలై 20: ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్, స్కూల్ కాంప్లెక్స్ కోసం కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం స్థల పరిశీలన చేశారు. రామాయంపేటలో ఇందుకు కావాల్సిన 20 ఎకరాల ప్రభుత్వ భూమిని చూశారు. నిర్మాణానికి అనువైన మూడు స్థలాలను ఆర్‌బీ ఈఈ సర్దార్‌సింగ్, తహసీల్దార్‌తో కలిసి పర్యవేక్షించారు. వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం తరచూ ప్రమాదాలు జరుగుతున్న బైపాస్ రోడ్డును కలెక్టర్ పరిశీలించారు.


అభినందన సభలో ఎంపీ రఘునందన్‌రావు

జిల్లా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

పటాన్‌చెరు, జూలై 20: సంగారెడ్డి జిల్లా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. అమీన్‌పూర్ బీజేపీ నాయకులు శనివారం బీరంగూడ బాలాజీ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన అభినందన సమావేశానికి హాజరై మాట్లాడారు. తన గెలుపులో కీలకపాత్ర పోషించిన పార్టీ కార్యకర్తలు, నాయకులకు రుణపడి ఉంటానన్నారు. ముఖ్యంగా పటాన్‌చెరు నియోజకవర్గంలోని సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. పట్టణ స్వరూపం సంతరించుకున్న అమీన్‌పూర్ మున్సిపాలిటీలో మౌలిక వసతుల కృషికి తోడ్పాటు అందిస్తానని చెప్పారు. బీరంగూడ, పటాన్‌చెరు జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యకు చెక్ పట్టేందుకు మెట్రో రైలు విస్తరణపై దృష్టి కేంద్రీకరించామన్నారు. ఈ సందర్భంగా అమీన్‌పూర్ బీజేపీ నాయకులు ఎంపీని ఘనంగా సన్మానించారు. బీరంగూడ బ్రాహ్మణ సంఘం నాయకులు సైతం ఎంపీని సన్మానించి వేదమంత్రాలతో ఆశీర్వచనాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎడ్ల రమేష్, ఆదెల్లి రవీందర్, పార్టీ అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి పాల్గొన్నారు.

లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు అభినందనీయం

- సంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర

మునిపల్లి, జూలై 20: మండల పరిధిలోని కంకోల్ గ్రామ శివారులోని వోక్సెన్ యూనివర్సిటీలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర పేర్కొన్నారు. శనివారం యూనివర్సిటీలో ఎయిడ్ క్లినిక్ సెల్‌ను ప్రారంభించిన అనంతరం సామాజిక కార్యకర్తలతో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, న్యాయ సహాయాన్ని అందిపుచ్చుకోవాలని ప్రజలకు సూచించారు. యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులకు న్యాయ సహాయం అందించడమే లక్ష్యంగా లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సంజీవరావు, డీడబ్ల్యూవో లలితకుమారి, సీడబ్ల్యూసీ మెంబర్ విష్ణుమూర్తి, డీసీపీ రత్నం, వోక్సెన్ లా డైరెక్టర్ డాక్టర్ శ్రీలత పాల్గొన్నారు.



గ్రామానికి వెళ్లేముందు ఎయిర్‌ఫోర్స్ అకాడమీ ఏర్పాటుచేసిన గేటు

దిగ్బంధం చెర వీడేదెప్పుడు..?

- పదేళ్లుగా పహారాలోనే ఆ ఊరి బతుకులు
- బంధువులు రావాలన్నా అనుమతి తప్పనిసరి
- పరిహారం కోసం ఏళ్లుగా పడిగాపులు
- పాలకుల చెవికెక్కని గోడు
- ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవాలని గ్రామస్థుల వేడుకోలు

గుమ్మడిదల, జూలై 20: ఆ ఊరు పదేళ్లుగా నిర్బంధంలో ఉన్నది. పరిహారం అందక.. న్యాయం జరగక.. కోర్టు స్టేతో గ్రామంలోని ప్రజలు ఆంక్షల మధ్య బతుకుతున్నారు. చుట్టూ కంచె.. ఊరిలోకి వెళ్లాలన్నా.. బంధువులు రావాలన్నా.. అధికారుల అనుమతి తీసుకోవాల్సిందే. అలాంటి దుర్భర పరిస్థితుల్లో ఉన్న గ్రామమే దార్గుల్ల. తమ సమస్య పరిష్కరించాలని గొంతెత్తినా పాలకుల చెవికి ఎక్కడం లేదు. అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమను పట్టించుకోని న్యాయం చేయాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని దార్గుల్ల, దాచారం గ్రామాలను దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో కలిపేందుకు కొన్నేళ్ల క్రితం అధికారులు సర్వేచేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆయా గ్రామాల్లోని వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించారు. కానీ కొన్ని మిగులు భూములకు, ఇళ్లకు పరిహారం అందించలేదు. దీంతో కొన్నేళ్లుగా ఆయా భూముల్లో రెండు గ్రామాలవారు వ్యవసాయం చేసుకుంటూ అక్కడే జీవనం సాగిస్తున్నారు. కానీ 2009లో ఎయిర్‌ఫోర్స్ అకాడమీ ఒక అడుగు ముందుకేసి విస్తీర్ణ పనుల్లో వేగం పెంచారు. ఆ రెండు గ్రామాలను లోపలికి కలుపుకుంటూ చుట్టూ ప్రహరీ నిర్మించారు. గేటు కూడా నిర్మిస్తుండగా రెండు గ్రామాల ప్రజలు పరిహారం అందలేదని ఆందోళన చేశారు. వారి కోరిక మేరకు గేటు నుంచి గ్రామాలకు వెళ్లే విధంగా అనుమతి ఇచ్చారు. 2015 దాచారం గ్రామానికి చెందిన గ్రామస్థులకు జిన్నారం మండలం కిష్టయ్య పల్లెలోని ప్రభుత్వ భూముల్లో ఇళ్లపట్టాలు ఇచ్చి.. బలవంతంగా ఊరిని ఖాళీ చేయించారు. దీంతో ఆ గ్రామస్థులు గత్యంతరం లేక తమ కేటాయించిన ఇళ్లల్లో ఎలాంటి సౌకర్యాలు లేకుండా రేకుల షెడ్లు వేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు.

మేం ఖాళీ చేయం

దార్గుల్ల గ్రామంలోని 120 ఎకరాల భూములకు సంబంధించి తగిన పరిహారం అందలేదని, పరిహారం అందించేవరకూ ఖాళీ చేసేది లేదంటూ గ్రామస్థులు అప్పట్లో కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆ గ్రామస్థులకు న్యాయం జరిగేవిధంగా చూడాలని స్టే ఇవ్వడంతో అన్నారం ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అధికారులు దార్గుల్ల గ్రామంలోనే ఉండేవిధంగా వెసులుబాటు కల్పించారు. దీంతో ఊరిలోనే ఉంటూ పనులు చేసుకుంటున్నారు. దాదాపు 50 ఇళ్లు, 300 మందికిపైగా జనాభా కలిగిన దార్గుల్ల గ్రామంలోని ప్రజలు ఇప్పటివరకూ స్టేపైన నివాసముంటున్నారు. పదేళ్లు గడుస్తున్నా పరిహారం అందలేదని, ప్రహరీ మధ్యనే తమ బతుకులు సాగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎవరైనా బంధువులు ఇక్కడి రావాలన్నా.. ఎక్కడికి వెళ్లాలన్నా.. షరతులతో కూడిన అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉన్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకు న్యాయం జరిగేలా చూడాలని వేడుకుంటున్నారు.

ఎమ్మెల్యే గారూ.. పట్టించుకోండి

ఎన్నోఏళ్ల నుంచి దార్గుల్ల, దాచారం గ్రామస్థులు పరిహారం కోసం పోరాటం చేస్తున్నా ఫలితం దక్కలేదని, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పట్టించుకోని మా సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు. శనివారం గుమ్మడిదలలో వారు విలేకరులతో మాట్లాడారు. రెంగు గ్రామాల్లోని మిగులు భూములకు పదేళ్లవుతున్నా పరిహారం రాలేదన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మహిపాల్‌రెడ్డి తమ సమస్య పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. మూడోసారి గెలిచి ప్రస్తుతం అధికార పార్టీలో కొనసాగుతున్న మహిపాల్‌రెడ్డి గారు స్పందించి దార్గుల్ల, దాచారం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎయిర్‌ఫోర్స్, కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి, తమ భూములకు మార్కెట్‌తో కూడిన ధరలు అందించే విధంగా కృషి చేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో దార్గుల గ్రామానికి చెందిన తుమ్మ సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య గ్రామస్థులు మహేష్ సంతోష్, బాజిరెడ్డి, మిల్కారెడ్డి పాల్గొన్నారు.


ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ప్రహరీ లోపల నివాసముంటున్న దార్గుల్ల గ్రామం

పలు మండలాల్లో ఎడతెగని ముసురు



హోతి(కే) గ్రామానికి వెళ్లే రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు

జహీరాబాద్/కోహీర్, జూలై 20: జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని మొగుడంపల్లి, ఝరాసంగం, జహీరాబాద్, కోహీర్, మొగుడంపల్లి మండలాల్లో గత రెండు(శుక్ర, శనివారాల్లో) రోజులుగ ఎడతెరిపి లేకుండా చిరుజల్లులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. దీంతో అంతర్గత రోడ్లపై మురుగునీరు, వరదనీరు ప్రవహించడంతో ప్రజలకు ఇబ్బందిగ మారింది. ఎడతెరిపి లేని వర్షానికి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ముఖ్యంగా ప్రధానరోడ్లు, అంతర్గత రోడ్లన్ని గుంతలమయంగా మారి నీరు నిలవడంతో వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందిగా మారింది. రాంనగర్ మీదుగ హోతి(కే) గ్రామానికి వెళ్లే రోడ్డుపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాగా కోహీర్ మండలంలోని ఆయా గ్రామాల్లో వర్షాకాలం ప్రారంభం నుంచి అనుకున్న మేర వర్షాలు కురియకపోవడంతో చాలామంది రైతులు పొలాల్లో ఆలస్యంగానే విత్తనాలను నాటుకున్నారు. ఆశించిన వర్షపాతం లేక ఆందోళనలో ఉన్న రైతులకు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఊరటనిచ్చాయి. కోహీర్ మండలంలో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం వరకు 17.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు మండల అంకగణంకాల అధికారి రాజేష్ తెలిపారు. కోహీర్‌లోని నారింజ వాగు పరవాక ప్రాంతాల్లోని నల్లరేగడి పంట పొలాల భూముల్లో వర్షపు నీరు చేరింది. ఈ వర్షాలతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

● మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్

నారాయణఖేడ్, జూలై 20: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్యం పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని ఖేడ్ మున్సిపల్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్‌చైర్మన్ దారం శంకర్‌లు మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్, పారిశుధ్య కార్మికులకు సూచించారు. శనివారం తెల్లవారు జామున ఖేడ్ పట్టణంలో రోడ్లపై పారిశుధ్య పనులను వారు అకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మంగల్‌పేటలోని ప్రధానరోడ్లపై నిలిచిన నీటిని, పలు కాలనీల్లోని మురుగు కాల్వల్లోని మురుగు తొలగింపు పనులను పరిశీలించారు. మురుగు కాల్వల్లో ప్లాస్టిక్, చెత్త పేరుకుపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు కాల్వల్లోని పూడికను తొలగించాలని సూచించారు.

వర్షానికి చిత్తడైన పారిశ్రామిక వాడ

● అప్రమత్తమైన జీహెచ్‌ఎంసీ సిబ్బంది

పటాన్‌చెరు, జూలై 20: పటాన్‌చెరులో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పారిశ్రామికవాడ చిత్తడిగా మారింది. పెద్ద ఎత్తున వరదనీరు రోడ్లపై పారింది. మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లే అవకాశం ఉండటంతో జీహెచ్‌ఎంసీ సిబ్బంది అప్రమత్తమైంది. డివిజన్ పరిధిలోని మార్కెట్ రోడ్డు, కటికె బస్తీ, శ్రీనగర్ కాలనీ, జేపీ. కాలనీ, విద్యానికేతన్ పాఠశాల వద్ద వరద నీరు రోడ్లపై పెద్ద ఎత్తున వచ్చి చేరడంతో జీహెచ్‌ఎంసీ మాన్‌సూన్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం రంగంలోకి దిగి మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ డివిజన్‌లో పర్యటించి వరదనీరు నిల్వ చేరకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో మ్యాన్‌హోల్స్ మూతలను తొలగించకూడదని వర్షానికి వరదనీరు ఎక్కువగా వచ్చి చేరితే జీహెచ్‌ఎంసీ సిబ్బందికి ఫిర్యాదు చేయాలని సూచించారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వర్షాలు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



అమీన్‌పూర్ మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

వర్షాలు, ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మలపాండురంగారెడ్డి మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం వార్డు ఆఫీసర్లు, మున్సిపల్, ఆరోగ్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. భారీ వర్షాలు పడుతున్నందున మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరో వైపు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పట్టణ ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు కాలనీల్లో నిత్యం ఫాగింగ్ నిర్వహించాలన్నారు. డెంగీ, మలేరియా ప్రబలే అవకాశం ఉన్నందున నివాసాల పరిసరాల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, అమీన్‌పూర్ సీఐ నాగరాజు, టీపీవో పవన్, ఆర్‌వో వెంకటరామయ్య, శానిటరీ ఇనిస్పెక్టర్ అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిలో కాలుష్య జలాలు

జిన్నారం, జూలై 20: మండల వ్యాప్తంగా శనివారం భారీ వర్షపాతం నమోదు కాగా, పారిశ్రామిక వాడల్లో కాలుష్య వ్యర్థాల ప్రవాహం యథేచ్ఛగా జరిగింది. గడ్డపోతారం, కాజీపల్లి, బొల్లారం పారిశ్రామికవాడల్లోని పలు పరిశ్రమల అవుట్‌లెట్ల నుంచి వ్యర్థ రసాయనాలను భారీస్థాయిలో దిగువ ప్రాంతాలకు వర్షపు నీటిలో కలిపి వదిలేశారు. అదే విధంగా బహిరంగ ప్రాంతాల్లోనూ వర్షపు నీటిలో కాలుష్య జలాలు వచ్చి చేరాయి.



కాజీపల్లి సమీపంలో రసాయన వ్యర్థాల ప్రవాహం

అధ్వానంగా 'డబుల్' ఇళ్ల రోడ్లు



గుంతలమయంగా ప్రధాన రహదారి

మెదక్ మున్సిపాలిటీ, జూలై 20: ఏడాది గడిచినా రోడ్ల సమస్యను తీర్చడం లేదంటూ డబుల్ బెడ్‌రూం కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెదక్ పట్టణ శివారులోని పిల్లికొట్టాల్ వద్ద 1000 డబుల్‌బెడ్ రూంలు నిర్మించిన విషయం తెలిసిందే. 500 ఇళ్లు పూర్తిస్థాయిలో నిర్మాణం కావడంతో గత ఏడాది లబ్ధిదారులకు అందజేశారు. ఇళ్లు పూర్తయినప్పటికీ మౌలిక సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు. పిల్లికొట్టాల్ ప్రధాన రహదారి నుంచి కాలనీకి వెళ్లే 100 ఫీట్ల రహదారితో పాటు 50 ఫీట్ల ఇంటర్నల్ రహదారులు కూడా నిర్మించలేదు. ప్రారంభసమయంలోనే హడావిడిగా మట్టిరోడ్ల నిర్మాణాలు చేపట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో వర్షం పడినప్పుడల్లా రోడ్లన్ని చిత్తడిచిత్తడిగా మారుతున్నాయి. గత రెండుమూడు రోజులుగా కురుస్తున్న కొద్దిపాటి వర్షానికే కాలనీలోపలి రహదారులు నీటికుంటలుగా గుంతలు నీటితో నిండుకున్నాయి.రోడ్లన్ని బురదమయంగా మారడంతో శనివారం కాలనీవాసులు రోడ్లపైకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులు స్పందించి డబుల్ ఇళ్లకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వైభవంగా విఠలేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవంలో భక్తులు

పెద్దశంకరంపేట, జూలై 20: ఆషాడ మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం పెద్ద శంకరంపేటలో విఠలేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై రుక్మిణీ విఠలేశ్వర స్వామి ఉత్సవవిగ్రహాలను ఉంచి భక్తుల భజనలు, కీర్తనల మధ్య రథాన్ని లాగుతూ పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. మహిళలు స్వామి వారికి మంగళహారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బృందం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'అనర్హతపై కోర్టు ఆదేశాలు అమలు చేయాలి'

జిన్నారం, జూలై 20: బొల్లారం మున్సిపాలిటీ 10వ వార్డు కౌన్సిలర్ శైలజను అనర్హురాలిగా ప్రకటిస్తూ జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాల కాపీలను కాంగ్రెస్ నాయకులు కమిషనర్‌కు అందజేశారు. శనివారం మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాలమ్మ, నాయకులు మహేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, వెంకటయ్య, నర్సింహ్మారాజులు కమిషనర్ మంగతాయారును కలిశారు. బీసీ స్థానం నుంచి ఓసీ సామాజిక వర్గానికి చెందిన శైలజ కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలుపొందారని, ఈ విషయమై రెండోస్థానంలో నిలిచిన నర్సింహరాజు కోర్టులో కేసు వేయడంతో, విచారణ అనంతరం న్యాయస్థానం ఈ నెల 3న శైలజను అనర్హురాలిగా ప్రకటించిందన్నారు. వెంటనే కోర్టు ఆదేశాలను అమలు చేయాలని కమిషనర్‌కు పత్రాలను అందజేసినట్లు తెలిపారు.

టీజీఐఐసీ చైర్ పర్సన్‌ను కలిసిన మాజీ సర్పంచ్



టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలను సన్మానిస్తున్న పోతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సుమంగళిచంద్రశేఖర్

సంగారెడ్డి టౌన్, జూలై 20: టీజీఐఐసీ చైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన డీసీసీ అధ్యక్షురాలు తూర్పు నిర్మలాజగ్గారెడ్డిని సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ గోపన్నగారి సుమంగళి చంద్రశేఖర్ ఆదివారం సన్మానించారు. సంగారెడ్డిలోని ఆమె నివాసానికి వెళ్లి శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిర్మలాజగ్గారెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని ఆమె కొనియాడారు. సన్మానించిన వారిలో నాయకులు గోపన్నగారి చంద్రశేఖర్, బ్రహ్మచారి, స్వరూప, సుహాసిని ఉన్నారు.

మండి హోటల్ మూసేశారు !

● ఫుడ్‌పాయిజన్ బారిన పడిన మరికొందరు

తూప్రాన్, జూలై 20: ఫుడ్‌పాయిజన్‌కు గురై పలువురు అస్వస్థతకు గురికావడంతో హోటల్‌ను శనివారం మూసివేశారు. మండి భోజనం చేసి అస్వస్థతకు గురైన రోగులు పెరుగుతున్నారు. తూప్రాన్ పట్టణంలోని మండి హోటల్‌లో భోజనం చేసిన పలువురు అస్వస్థతకు గురైన ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఆంధ్రజ్యోతిలో శనివారం 'హోటల్ బిర్యానీ తిని 15 మందికి అస్వస్థత' అంటు కథనం ప్రచురితమైంది. దాంతో మున్సిపల్ అధికారులు శనివారం మండి హోటల్‌ను సందర్శించి విషయాన్ని ఆరా తీసేందుకు యత్నించారు. శనివారం సదరు హోటల్‌ను తెరవకుండా మూసివేశారు. మండి హోటల్ ఘటనపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ ఖాజామోహియుద్దీన్ తెలిపారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు ప్రారంభం



రామాయంపేట హైస్కూల్ టీచర్లకు మొదటి సభ్యత్వం ఇస్తున్న సబ్బని శ్రీనివాస్

రామాయంపేట, జూలై 20: పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు సబ్బని శ్రీనివాస్ రామాయంపేటలో ప్రారంభించారు. జిల్లాలోనే మొదటగా ఇక్కడి హైస్కూల్ టీచర్లకు సభ్యత్వం ఇచ్చారు. ఈ నెల 31లోగా జిల్లాలో మూడువేల వరకు సభ్యత్వాలు పూర్తి చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. ఆశయ్య, ప్రమోద్, స్వరూపరాణి ఉన్నారు.

రుణమాఫీపై సునీతారెడ్డి విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ తదితరులు

నర్సాపూర్, జూలై 20: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తే అభినందించాల్సింది పోయి విమర్శించడం స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డికి తగదని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల వరకు ఆగస్టు 15లోపు మాఫీ చేసి తీరుతామన్నారు. రుణమాఫీతో రైతులంతా సంతోషంగా పండుగ చేసుకుంటే బీఆర్‌ఎస్ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు శేషసాయిరెడ్డి,కరుణాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ లలిత, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్, సందీప్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జూలై 20: పెండింగ్ కేసుల దర్యాప్తు త్వరగా పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని మెదక్ జిల్లా జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నెలవారి నేర సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏయే అంశాలపై దృష్టి సారించాలనే విషయాలపై వివరించారు. ఫోక్సో కేసులపై ప్రత్యేకదృష్టి సారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరాల ఏర్పాటు అవశ్యకత గురించి వివరించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ రాజేష్, జిల్లాలోని సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా చెట్లు నరికితే చర్యలు

చిన్నశంకరంపేట, జూలై 20: అక్రమంగా చెట్లు నరికితే చర్యలు తీసుకుంటామని చిన్నశంకరంపేట తహసీల్దార్ మన్నన్ హెచ్చరించారు. శనివారం తహసీల్దార్ మాట్లాడుతూ రోడ్ల వద్ద, గ్రామాల్లోని చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా నరికివేస్తే చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామన్నారు. మొక్కల ఎదుగుదల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎవరైన సొంత పొలాల్లో, ఇంటి ఆవరణలో చెట్లను నరకాలంటే రెవెన్యూ, ఫారెస్టు అధికారుల అనుమతి ఉండాలన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



సంగారెడ్డి పట్టణంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సంగారెడ్డి క్రైం, జూలై 20: సంగారెడ్డి పట్టణంలో పట్టణ పోలీసులు శనివారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడం కోసం ఈ వాహన తనిఖీలు నిర్వహించినట్లు పట్టణ సీఐ ఎస్.భాస్కర్ తెలిపారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. డాగ్ స్క్వాడ్‌తో ఈ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఎలాంటి నిషేధిత వస్తువులు లభించలేదని పట్టణ సీఐ భాస్కర్ తెలిపారు.

ఈతవనాలతో గీత కార్మికుల ఉపాధి

పుల్‌కల్, జూలై 20: ఈత వనాల పెంపుతో గీత కార్మికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గొంగ్లూరు గ్రామ శివారులోని మైసమ్మ చెరువు కట్టపై వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామ గీత పారిశ్రామిక సహకారసంఘం అధ్వర్యంలో శనివారం ఈత మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు సందీప్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు మాణయ్యగౌడ్, సభ్యులు శ్రీకాంత్‌గౌడ్, నగేష్‌గౌడ్, వెంకటేశంగౌడ్, రమేశ్‌గౌడ్, గంగాగౌడ్, ప్రభుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నాగరాజ్‌గౌడ్, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరుపై డీపీవో ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో సాయిబాబ

ఝరాసంగం, జూలై 20: వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్య పనులను సక్రమంగా చేపట్టాలని, విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా హెచ్చరించారు. శనివారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీకార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో డంపింగ్‌యార్డుల నిర్వహణపై అధికారులు, పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, మురుగుకాలువల పరిశుభ్రతతో పాటు బ్లీచింగ్ పౌడర్‌ను తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. ఎంపీఈవో లక్ష్మయ్య, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్తమ బ్లడ్ డోనర్‌గా భిక్షపతిరెడ్డి

గుమ్మడిదల, జులై 20: ఉత్తమ బ్లడ్ డోనర్‌గా మండలంలోని బొంతపల్లి గ్రామవాసి వివేకానంద స్వచ్ఛంద సంస్థ యోగా గురువు సరెడ్డిగారి భిక్షపతిరెడ్డి రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. శనివారం హైదరాబాదులోని ముషీరాబాద్‌లో గల వైశ్యభవన్‌లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఐవీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రక్తదానంలో చేస్తున్న సేవలను గుర్తించి ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో 73 మంది రక్తదాతలకు తెలంగాణ రాష్ట్ర ఉత్తమ రక్తదాతల పురస్కారాలు-2024 అందించారు. రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఐవీఎఫ్ సెంట్రల్ కమిటీ బోర్డు అడ్వైజరీ బోర్డు చైర్మన్ రాజమౌళి గుప్తా హాజరై ప్రశంసాపత్రం,, మెమొంటోతో సన్మానించారు.

జహీరాబాద్ ఎమ్మెల్యేకు అస్వస్థత

● పరామర్శించిన హరీశ్‌రావు



యశోద ఆస్పత్రిలో మాణిక్‌రావును పరామర్శిస్తున్న హరీశ్‌రావు

జహీరాబాద్, జూలై 20: జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. ఫుడ్ ఇన్‌ఫెక్షన్‌తో ఆయనకు వాంతులు, విరోచనాలు కావడంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించారు. కొన్ని రోజులుగా ఆయన చైన్నై తదితర ప్రాంతాలకు వెళ్లి వచ్చారు. అక్కడ కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల అస్వస్థతకు గురైనట్లు భావిస్తున్నారు. శనివారం మాజీ మంత్రి హరీశ్‌రావు ఆస్పత్రిలో ఎమ్మెల్యేను పరామర్శించారు. శనివారం రాత్రి వరకు ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు.. ఒకరి మృతి



సుభాష్(ఫైల్)

కౌడిపల్లి, జూలై 20: ఎదురుగా వస్తున్న కారు అదుపు తప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొటిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కౌడిపల్లి శివారులో శనివారం సాయంత్రం చోటు చేసుకున్నది. మండల పరిధిలోని ధర్మసాగర్ గ్రామానికి చెందిన రెడ్డి సుభాష్(30) తన ద్విచక్ర వాహనంపై కౌడిపల్లికి వెళ్లి తిరుగుప్రయాణమయ్యాడు. అతడు ఇండియన్ పెంట్రోల్ బంకు సమీపంలోకి చేరుకోగానే నర్సాపూర్ నుంచి మెదక్ వైపు వెళ్తున్న కారు సుభాష్ బైక్‌ను బలంగా ఢీకొనడంతో అతడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సమాచారమందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

హత్నూర, జూలై 20: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురై ఓ వ్యక్తి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. హత్నూర మండలం రెడ్డిఖానాపూర్ గ్రామానికి చెందిన నర్సాపురం అశోక్‌గౌడ్(40)కు 16ఏళ్ల క్రితం వెల్దుర్తి మండలం అందులపల్లి గ్రామానికి చెందిన స్వప్నతో వివాహమైంది. ఆరేళ్ల నుంచి కుటుంబంలో కలహాలు ఏర్పడి భార్య స్వప్న, కుమారుడు, కూతురును తీసుకుని తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి అశోక్‌గౌడ్ తల్లి దేవమ్మ వద్ద ఉంటున్నాడు. భార్య విషయమై తరచూ తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో శనివారం గ్రామ శివారులోని పత్తి కుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి దేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీసీ కుల గణన చేసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

చిన్నశంకరంపేట, జూలై 20: బీసీ కుల గణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం చిన్న శంకరంపేటలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే బీసీ కుల గణన చేపట్టి స్థానికల సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చిందన్నారు. ఏటా బడ్జెట్‌లో రూ. 20వేల కోట్లు, ఐదేళ్లలో లక్ష కోట్ల హామీని గుర్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు. ప్రతీ జిల్లా కేంద్రంలో 50 కోట్లతో బీసీ భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఖేడ్‌లో ఐటీఐ మంజూరుకు కృషి

నారాయణఖేడ్, జూలై 20: ఖేడ్ నియోజకవర్గంలో ప్రభుత్వ ఐటీఐని మంజూరు చేయడంతో పాటు అందులో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ కోర్సును ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శనివారం ఖేడ్ ఎంపీపీ కార్యాలయంలో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఇన్నోవేటర్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. వివిధపరిశోధనలు చేసిన పలువురు యువకులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఇన్నోవేషన్‌సెల్ జిల్లా ఇన్‌చార్జి సాయిశ్రీజ, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

చేగుంట జూలై 20: మండలంలోని కన్యరం గ్రామంలో చేగుంట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మల్లారెడ్డి హాస్పిటల్ వారి సౌజన్యంతో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 178 మంది రోగులకు డాక్టర్లు వంశీకృష్ణ, హరికృష్ణ ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. 38 మందికి చికిత్సల నిమిత్తం మల్లారెడ్డి ఆసుపత్రులకు తరలించినట్లు పీఆర్‌వో రవి తులిపారు. కార్యక్రమంలో సెక్రటరి దారావత్ శ్రీనివాస్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బుర్క నాగరాజు, సెక్రెటరి రాజనక్ రాంచంద్రం, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సిర్గాపూర్ మండలంలో పాఠశాలల తనిఖీ

కల్హేర్, జూలై 20; సిర్గాపూర్ మండల పరిధిలోని పాఠశాలలను సర్వశిక్షా అభియాన్ జిల్లా ముఖ్య నిర్వహణ అధికారి (సీఎంవో) వెంకటేశం శనివారం పరిశీలించారు. మండలంలోని కడ్పల్ ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు ఐఈఆర్సీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుచున్న విద్యాభ్యాసం, మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అనంతరం టీచర్స్, పేరెంట్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని కేజీబీవీని సీఎంవో తనిఖీ చేశారు. ఆయన వెంట మండల విద్యాధికారి శంకర్, హెచ్‌ఎంలు ఉన్నారు.

చిన్నారుల పాలిట వరం అంగన్‌వాడీలు



నర్సాపూర్ మున్సిపల్‌లో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో మాట్లాడుతున్న చైర్మన్

నర్సాపూర్, జూలై 20: ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీలు చిన్నారుల పాలిట వరమని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ మాట్లాడుతూ శిశువులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడం వల్ల నైతిక విలువలు, భాషా పరిజ్ఞానం, సమాజంలో కలిసిపోవడం వంటి అంశాలను నేర్చుకోవడమే కాకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సీడీపీవో హేమభార్గవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల కోసం సహకరించాలని పాలకవర్గాన్ని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లతారమేష్‌యాదవ్, యాదగిరి, నాయకులు మేనేజర్ మధుసూదన్, సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పిల్లల సంఖ్య పెంచండి

మునిపల్లి, జూలై 20: రెండున్నరేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి పిల్లల సంఖ్యను పెంచాలని డీడబ్ల్యూవో లలితకుమారి అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని పెద్దగోపులారం అంగన్‌వాడీ1 కేంద్రంలో నిర్వహించిన అక్షరభ్యాస కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే పౌష్టికాహార విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పిల్లల తల్లులకు సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, శకుంత, ఆశావర్కర్ పద్మ, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెల్మెడలో చిన్నారులకు అక్షరాభ్యాసం

మునిపల్లి, జూలై 20: మండల పరిధిలోని పెద్దచెల్మెడ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ రేణుక ఆధ్వర్యంలో శనివారం అమ్మ మాట అంగన్‌వాడీబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ రేణుక మాట్లాడుతూ రెండు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ప్రజలకు సూచించారు. అంతకు ముందు పిల్లలకు అక్షరభ్యాసం చేయించారు. కార్యక్రమంలో జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు అజయ్, వీవో లీడర్స్ మమత, అంజమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు రోజూ పాఠశాలకు వచ్చేలా చూడాలి

● పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలు



శివ్వంపేట: దొంతి పాఠశాలలో పేరెంట్ మీటింగ్ లో మాట్లాడుతున్న హెచ్‌ఎం రవి

నిజాంపేట, జూలై 20: విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలలకు వచ్చే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు అరుణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల అనంతరం ఇంటికి వచ్చిన విద్యార్థులకు చదువుకునే విధంగా ప్రోత్సహిస్తూ, ఉపాధ్యాయులకు సహకరించాలన్నారు. సమావేశంలో ఏపీపీఎస్ చైర్మన్ శ్వేత, ఉపాధ్యాయులు వినోద్ కుమార్, లక్ష్మి, శ్వేత, బాల్‌లక్ష్మి, ప్రమీల పాల్గొన్నారు.

● శివ్వంపేట, జూలై 20: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ప్రతి నెలా 100 శాతం ఉన్న విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులు ఇచ్చేందుకు పాఠశాల పేరెంట్ మీటింగ్‌లో నిర్ణయించినట్లు దొంతి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రవి పేర్కొన్నారు. మండల పరిధిలోని దొంతి ఉన్నత పాఠశాలలో శనివారం పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. పదో తరగతిలో 10 జీపీఏ ఉత్తీర్ణత దిశగా ఉపాధ్యాయులకు సూచనలు చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ దుండిగాల లక్ష్మి,ఉపాధ్యాయులు, విద్యార్థులతల్లిదండ్రులు పాల్గొన్నారు.

● పుల్‌కల్, జూలై 20: ఇంటి వద్ద విద్యార్థుల బాగోగులను చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఆధారపడి ఉన్నదని చౌటకూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జడ్పీహెచ్‌ఎస్ అమ్మ పాఠశాల కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు పట్టించుకుంటారని, ఇంటికి వెళ్లాక వారు చదువుతున్నది లేనిది తల్లీదండ్రులు చూడాల్సి ఉటుందన్నారు. ఓ వైపు ఉపాధ్యాయులు మరో వైపు తల్లిదండ్రులు సమష్టిగా కృషి చేస్తేనే ఆశించిన ఫలితాలకు అవకాశముంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు వర్కల రమేశ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామాగౌడ్, కొల్కూరి మొగులయ్య, కైసర్, మల్లికార్జున్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల రుణమాఫీ సంబురాలు



నారాయణఖేడ్: మాద్వార్‌లో సీఎం, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

నారాయణఖేడ్, జూలై 20: రైతులకు రుణమాఫీ నేపథ్యంలో ఖేడ్ మండలం మాద్వార్‌లోని ప్రధానచౌక్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేష్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు శనివారం క్షీరాభిషేకం చేశారు.

● హవేళిఘణపూర్: మండలంలోని వాడి గ్రామంలో కాంగ్రెస్ పార్టీనాయకులు మాజీ ఎంపీటీసీ సాయిలు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, కిషన్‌రెడ్డి, సాయిరెడ్డి, భాస్కర్, శ్రీశైలమం, తదితరులు పాల్గొన్నారు.

● వెల్దుర్తి: మండల పరిధిలోని చర్లపల్లి గ్రామంలో శనివారం రైతు రుణమాఫీ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులు, నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు నర్సింహులు, పోచయ్య, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

● రేగోడు: మండలంలోని ఆర్ ఇటిక్యాల గ్రామంలో రైతులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ రాజేంద్ర పాటిల్ మాట్లాడుతూ.. రుణమాఫీతో రైతులు ఆనందంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఈశ్వరప్ప, రైతులు పాల్గొన్నారు.